నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల
వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శనివారం 25 మే 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY



డాగ్‌స్క్వాడ్ తిరిగిన ప్రాంతాన్నిప రిశీలిస్తున్న వనపర్తి ఎస్పీ రక్షితామూర్తి

# శ్రీధర్‌రెడ్డి కేసును త్వరలో ఛేదిస్తాం

- లక్ష్మీపురంగ్రా మాన్నిసం దర్శించిన ఎస్పీ రక్షితామూర్తి

చిన్నంబావి, మే 24 : మండలంలోని లక్ష్మీపల్లిలో బుధవారం రాత్రి బీఆర్‌ఎస్ నాయకుడు బొడ్డు శ్రీధర్‌రెడ్డి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఘటనా స్థలాన్ని ఎస్పీ రక్షితామూర్తి, డీఎస్పీ వెంకటేశ్వరావు, సీఐ నాగభూషణంతో కలిసి శుక్రవారం పరిశీలించారు. హత్య జరిగిన స్థలం, చుట్టుపక్కల పరిసరాలు, డాగ్‌స్క్వాడ్ తిరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం చిన్నంబావి పోలీస్ స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ, సీఐ, ఎస్సైలతో కలిసి చర్చించారు. త్వరలోనే కేసును ఛేదిస్తామని తెలిపారు. ఆమె వెంట ఎస్సై పబ్బతి రమేశ్, సిబ్బంది ఉన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాములు, (ఇన్‌సెట్లో) పట్టుబడిన నకిలీ విత్తనాలు

# నకిలీ పత్తి విత్తనాల కలకలం

- గోప్లాపూర్‌లో 2.21 క్వింటాళ్లు స్వాధీనం.. ఇద్దరి అరెస్టు
- ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశాం : ఏఎస్పీ రాములు

జడ్చర్ల టౌన్, మే 24 : మండలంలోని గోప్లాపూర్‌లో వ్యవసాయ, పోలీసుశాఖల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఓ ఇంట్లో నిల్వ ఉన్న 2.21 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. జడ్చర్ల పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ రాములు వివరాలను వెల్లడించారు. ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి నకిలీ పత్తి విత్తనాలను విక్రయించేందుకు గోప్లాపూర్‌లో భారీగా నిల్వ చేసినట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. దీంతో గురువారం అర్ధరాత్రి వ్యవసాయ, పోలీసుశాఖల అధికారులు గ్రామంలో ఆకస్మికంగా తనిఖీలు చేసి 2.21 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొని ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. గోప్లాపూర్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి గుంటూరు నుంచి ఈ విత్తనాలను తీసుకొచ్చి ఇక్కడి అమాయక రైతులకు అమ్మేందుకు నిల్వ చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. పట్టుబడిన విత్తనాలను ల్యాబ్‌కు పంపించి, ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ఎస్పీ, కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టీంతో పాటు మండలస్థాయిలో 15 ప్రత్యేక టీంలు పనిచేస్తున్నాయన్నారు. ఒక్కో టీంలో సీఐ, ఎస్సైతో పాటు వ్యవసాయశాఖాధికారులు ఉన్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు నకిలీ విత్తనాలు రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. అలాగే విత్తనాల తయారీ యూనిట్లు, డీలర్ల షాపుల్లోనూ విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. ఇలాంటి కేసుల్లో ఉన్న పాతనేరస్తులను గుర్తించి మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేస్తున్నామన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు పోలీసుశాఖ సహకారంతో తనిఖీలు చేస్తున్నామని డీఏవో వెంకటేశ్ అన్నారు. ఏఈవోల ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలపై పోస్టర్లు, కరపత్రాలను పంపిణీ చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తక్కువ ధరకు ఇస్తామనే దళారుల వద్ద విత్తనాలను కొనొద్దని, లైసెన్స్ ఉన్న దుకాణాల్లో ప్యాకింగ్‌తో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. సదరు ప్యాకెట్‌తోపాటు బిల్లులను జాగ్రత్తగా ఉంచుకుంటే భవిష్యత్తులో నష్ట పరిహారం పొందే అవకాశాలుంటాయన్నారు. సమావేశంలో జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ఏవోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ఊట్కూర్‌లో 13.7 కేజీలు..

ఊట్కూర్, మే 24 : మండలంలోని నిడుగుర్తి గ్రామంలో టాస్క్‌ఫోర్స్ బృందం, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి 13.7కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో గ్రామానికి చెందిన భీమప్ప ఇంటిపై దాడులు నిర్వహించి పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన విత్తన ప్యాకెట్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి ఏవో గణేశ్‌రెడ్డి సమక్షంలో పంచానామా చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. అధికారుల అనుమతులు లేకుండా నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# బైక్‌ను ఢీకొన్న లారీ : ఇద్దరి మృతి

- దైవదర్శనానికివె ళ్లొస్తుండగా ఘటన


పల్లె శ్రీకాంత్ (ఫైల్)

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మే 24 : కుల దైవం దర్శనానికి వెళ్లి బైక్‌పై ఇంటికి వస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొని ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన ఘటన మహబూబ్‌నగర్ శివారులో చోటుచేసుకున్నది. మహబూబ్‌నగర్ రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. భూత్పూర్ మండలం మద్దిగట్లకు చెందిన బండమీది బాబు (50), పల్లె శ్రీకాంత్ (25) శుక్రవారం దేవరకద్ర మండలంలోని తమ కులదైవాన్ని దర్శించుకోవడానికి బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దేవరకద్ర వైపు వెళ్తున్న లారీ (కేఏ 34 సీ 7116) మహబూబ్‌నగర్ సమీపంలోని ఆల్ మదీనా కాలేజీ వద్ద అతివేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బాబు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా.. శ్రీకాంత్‌ను స్థానికులు జిల్లా దవాఖానకు తరలించారు. కాగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వృత్తి రీత్యా బాబు గొర్ల కాపరి కాగా ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. శ్రీకాంత్‌కు రెండు నెలల కిందటే వివాహం కాగా హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. వీరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఈతచెట్టుపై పిడుగు

కేటీదొడ్డి, మే 24 : మండలంలోని చింతలకుంటలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈక్రమంలో గ్రామానికి చెందిన రైతు బ్యాగరి నాగప్ప పొలంలోని తాటిచెట్టుపై పిడుగుపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు గ్రామస్తులు తెలిపారు.

**విరిగిన కరెంట్ స్తంభం**

ధరూరు, మే 24 : మండలంలోని కోతులగిద్దలో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం విరిగిపడింది.



పిడుగుపాటుతో తాటిచెట్టుకు వ్యాపిస్తున్న మంటలు, మహబూబ్‌నగర్ పట్టణంలో విరిగిన చెట్టు

## ఉచిత బస్సుతో కష్టాలు



నేను పదో తరగతి వరకు చదువుకున్నాను. ఎనిమిదేండ్లుగా మహబూబ్‌నగర్–జడ్చర్ల రూట్‌లో ఆటో నడిపిస్తున్నాను. నాకు భార్య, ఓ కుమారుడు ఉన్నాడు. ఆటోపై రూ.లక్ష అప్పు ఉన్నది. ప్రతినెలా రూ.6,800 కిస్తు కడుతున్నాను. ప్రతిరోజూ 5 ట్రిప్పులు కొడితే రూ.1500 వచ్చేవి. ఫ్రీ బస్సు అయినక గిరాకీ లేక రూ.500 కూడా రావడం లేదు. మహిళలెవరూ ఆటోలో ఎక్కడం లేదు. ఒకవేళ ఆటోలో ఎవరైనా ఎక్కినా బస్సు వచ్చిందంటే దిగి వెళ్లిపోతున్నారు. ఈ ఏడాది బాబును స్కూల్‌లో చేర్పించాలి. ఫీజు రూ. 15వేలు అంటున్నారు. ఫీజుతోపాటు స్కూల్ డ్రెస్సు, బూట్లు, పుస్తకాల ఖర్చులు ఉంటాయి. కనీసం రూ.20వేల వరకు ఖర్చు అవుతుంది. బాబును చదివించుకోవాలంటే అప్పుచేయక తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మా జీవితాల్లో కష్టాలను తీసుకొచ్చింది.

*- కృష్ణ, ఆటో డ్రైవర్, జడ్చర్ల*


గద్వాల పట్టణంలో గిరాకీ లేక స్టాండ్‌లో నిలిచిన ఆటోలు

## ప్రభుత్వం ఆదుకోవాలి..



ప్రతి రోజూ గద్వాల నుంచి అనంతపురం గ్రామానికి ప్రయాణికులను తీసుకెళ్తుంటాను. ఖర్చులు పోనూ రూ.వెయ్యి దాకా వచ్చేది. ప్రస్తుతం ఆటోను అడ్డమీద పెట్టుకొని ప్రయాణికుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం బదులు చార్జీలు తగ్గించి ఉంటే ఇటు ప్రభుత్వానికి మాకు ఆదాయం ఉండేది. ప్రస్తుతం రోజుకు రూ.300 సంపాదించడం గగనంగా మారింది. పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నాం. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆర్థికంగా ఆదుకోవాలి.

*- గోపాల్, ఆటో డ్రైవర్, లత్తీపురం, గద్వాల*

# ఆటోవాలా.. బతుకు దివాలా!


గద్వాలలో గిరాకీ లేక ఆటోలో నిద్రిస్తున్న డ్రైవర్

- గిరాకీల్లేక.. ఈఎంఐలు కట్టలేక..
- ఆటోలను అమ్ముకుంటున్న వైనం
- దినదినగండంగా బతుకులు
- భారంగా మారిన కుటుంబ పోషణ
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

గద్వాల/జడ్చర్లటౌన్, మే 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటోవాలాల బతుకులపై గట్టి దెబ్బ కొట్టింది. కుటుంబ పోషణ భారంగా మారి ఇబ్బందులు పడుతున్నారు. దినదిన గండం నూరేండ్ల ఆయుష్షు అనే మాదిరి అయ్యింది వారి పరిస్థితి. ప్రస్తుతం గిరాకీలు లేక అడ్డాల వద్ద ఆటోలను నిలుపుకొని ప్రయాణికుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలో ఒక్కో ఆటో డ్రైవర్ డీజిల్ ఖర్చులు పోనూ ప్రతిరోజూ రూ.700 నుంచి రూ.వెయ్యి వరకు సంపాదించేవారు. దీంతో కుటుంబాలను పోషించుకోవడంతోపాటు ఈఎంఐలు సక్రమంగా చెల్లించేవారు. అయితే ఆరు నెలలుగా ఎంకి సావు సుబ్బి పెండ్లికి అడ్డు వచ్చినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటో కార్మికుల కుటుంబాలను వీధిన పడేలా చేసింది. మరో 20రోజులు అయితే పాఠశాలలతో పాటు కళాశాలలు ప్రారంభమవుతుండడంతో తమ పిల్లల ఫీజులు ఎలా చెల్లించాలి, పుస్తకాలతోపాటు యూనిఫామ్స్ ఇప్పించడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒక్కో ఆటో డ్రైవర్ ప్రతిరోజూ మూడు, నాలుగు ట్రిప్‌లు ఆటోలను నడిపేవారు. ప్రస్తుతం రోజుకు ఒక ట్రిప్ కూడా ప్రయాణికులను చేరవేయడానికి అవకాశం లేకుండా పోయింది. కేవలం రైతులు, వ్యాపారుల కిరాణం, ఎరువుల సంచులు ఇతర వాటి కోసం మాత్రమే ఆటోలను వినియోగిస్తుండడంతో డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. మహిళలంతా ప్రస్తుతం బస్సుల్లో ప్రయాణిస్తుండడంతో వీరిపై తీవ్ర ప్రభావం పడింది. ఒకప్పుడు మంచిగా గడిపిన తాము ప్రస్తుతం ఆ వృత్తిని వదిలి ఇతర పనుల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని డ్రైవర్లు వాపోతున్నారు. ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకుంటే తప్పా తమ పరిస్థితి మెరుగు పడేలా లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాలను ఆదుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

## బజారున పడ్డాం..



పదో తరగతి వరకు చదువుకున్నా.. ఐదేండ్లుగా మహబూబ్‌నగర్–జడ్చర్ల రూట్‌లో ఆటో నడుపుతున్నాను. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటో కోసం రూ.40 వేలు అప్పు తీసుకున్నాను. ప్రతి నెలా రూ.5వేలు కిస్తు కడుతున్నాను. ఫ్రీ బస్సు వచ్చినంక మహిళలు ఆటోలో ఎక్కడం లేదు. గతంలో రోజుకు రూ. 1200 మిగిలేవి. ఇప్పుడేమో రూ. 500 కూడా రావడం లేదు. ఖర్చులకే సరిపోవడం లేదు. కిస్తులు ఎలా కట్టాలో అర్థం కావడం లేదు. పిల్లల ఫీజులు, బుక్కుల కోసం అప్పు చేయక తప్పదు. వాటిని ఎలా తీర్చాలో తెలియడం లేదు. కాంగ్రెస్ సర్కారు ఉచిత ప్రయాణంతో మా బతుకులను బజారున పడేసింది.

*- శివ, ఆటో డ్రైవర్, జడ్చర్ల*




## కడుపు కొట్టిన సర్కారు



గతంలో గద్వాల నుంచి మా గ్రామానికి మూడు ట్రిప్పులు ప్రయాణికులను తీసుకెళ్లేవాళ్లం. దీంతో ఖర్చులు పోనూ రూ.800 వరకు వచ్చేవి. నెలనెలా ఈఎంఐలు కట్టేవాళ్లం. ఉచిత బస్సు ప్రయాణంతో సర్కారు మా కడుపు మీద కొట్టింది. ప్రస్తుతం ఒక్క ట్రిప్ కూడా వెళ్లడం లేదు. ఇరవై రోజులైతే పాఠశాలలు, కళాశాలలు తెరుస్తారు. ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్స్ తీసుకోవాలంటే ఏం చేయాలో అర్థం కావడం లేదు.

*- బండ్లయ్య, ఆటో డ్రైవర్, బీరెల్లి, గద్వాల*

## ఫ్రీ బస్సు శాపంగా మారింది



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణం ఆటో డ్రైవర్ల పాలిట శాపంగా మారింది. గతంలో రోజంతా నడిపితే డీజిల్, మెయింటనెన్స్ ఖర్చులు పోనూ రూ.500–600 మిగిలేవి. ఇప్పుడు రూ. 200 కూడా రావడం లేదు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు భారంగా మారాయి. ప్రభుత్వం తమ కష్టాలను గుర్తించి నెలకు రూ.10 వేలు అందించి ఆదుకోవాలి.

*- కాకర్లాల నర్సింహులు, ఆటో డ్రైవర్, రాజాపూర్*

## ఆటోలు అమ్ముకోవాల్సిందే..



నిత్యం గద్వాల నుంచి పూడూరుకు ఆటో నడుపుతున్నాను. గతంలో ఆటోల్లో ప్రయాణికులు బాగానే ఎక్కేవారు. ప్రస్తుతం అందరూ బస్సుల్లో వెళ్తుండడంతో గిరాకీలు లేకుండాపోయాయి. రోజుకు లైన్‌లో ఒక ట్రిప్ దొరికితే గగనం. కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. గిరాకీలు లేక ఈఎంఐలు కట్టలేకపోతున్నాం. బ్యాంకు అప్పు తీర్చడానికి తమకు తిండి పెట్టే ఆటోను అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రభుత్వ నిర్ణయం మంచిగా లేదు. ఆటోడ్రైవర్ల గురించి ఓసారి ఆలోచించాలి.

*- రవీందర్‌గౌడ్, ఆటో డ్రైవర్, గద్వాల*

# తవ్వేస్తాం.. దోచేస్తాం..!

### మమ్మల్ని ఆపేదెవరు?


కల్వకుర్తి మండలం గుండూర్‌స రిహద్దులో డంప్ చేసిన ఇసుక

- కల్వకుర్తి మండలంలో జోరుగా ఇసుక దందా
- అనుమతులు ఒక చోట.. తవ్వేది మరోచోట..
- ఇష్టానుసారంగాచె లరేగుతున్న ఇసుక మాఫియా
- పదే పదే అడ్డుకుంటున్న గుండూర్ గ్రామస్తులు
- ఇసుక డంప్ చేస్తే ఊరుకోబోమనిహె చ్చరిక
- చూసీచూడనట్లు వదిలేస్తున్న అధికారయం త్రాంగం

కల్వకుర్తి, మే 24 : ప్రభుత్వం అనుమతులిచ్చిన చోట కాకుండా తమ ఊరి సరిహద్దులో ఇసుకను తవ్వి డంపులుగా పోయడాన్ని నిరసిస్తూ గురువారం రాత్రి ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు కల్వకుర్తి మండలం గుండూరు గ్రామ ప్రజలు.. తాడూర్ మండలం పొలుమూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఇసుకను తవ్వేందుకు అనుమతులిస్తే గుండూర్ సరిహద్దుల్లో ఇసుకను తవ్వి తమ గ్రామంలోనే ఎందుకు డంప్ చేస్తున్నారని ప్రజలు నిలదీశారు. పెద్ద పెద్ద టిప్పర్లు తమ గ్రామంలోకి రావడంతో రోడ్లు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సరిహద్దుల్లోని దుందుభీ వాగు (పెద్దవాగు) నుంచి ఇసుకను తీస్తే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాగును నమ్ముకొని గ్రామమంతా బతుకుతుందని, తమ ఊరి సరిహద్దులో ఇసుక తీసి ఇసుక డంపులు పోయడాన్ని వ్యతిరేకిస్తూ ఇసుక ట్రాక్టర్లను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు.

**రెండ్రోజుల కిందట..**

రెండ్రోజుల కిందట గుండూర్‌లో ప్రజలు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దుందుభీ వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి గ్రామంలో డంప్ చేస్తున్నారు. నెల రోజులుగా ఈ తతంగం జరుగుతున్నది. ఎంపీ ఎన్నికల కారణంగా పది రోజులు ఇసుక దందా చేయలేదు. రెండ్రోజుల కిందటే 40 టిప్పర్లు ఇసుక డంపు వద్దకు చేరుకోగా గ్రామస్తులంతా ఏకమై అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. అనుమతులున్న చోట కాకుండా ఇక్కడెందుకు ఇసుకను తవ్వుతున్నారని ప్రశ్నించారు. ఊరి సరిహద్దుల్లో ఇసుకను తవ్వి ఇక్కడే డంప్ చేసి తరలిస్తామంటే ఊరుకోమని హెచ్చరించడంతో ఇసుక మాఫియా వెనుదిరిగింది.

**అధికార పార్టీ నాయకుడి ప్రోత్సాహంతోనే..**

గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడి అండతోనే ట్రాక్టర్లు గురువారం రాత్రి వాగులోకి వెళ్లే ప్రయత్నం చేశాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అడ్డుపడి.. అనుమతులున్న దగ్గరే ఇసుకను తీయాలని, ఇక్కడ డంప్ చేయొద్దని తేల్చి చెప్పారు. కాగా ఊళ్లోని ట్రాక్టర్లకు పని దొరికితే ఎందుకు అడ్డుకుంటున్నారని వాహనాల యాజమానులు గ్రామస్తులతో వాదనకు దిగారు. ఘర్షణకు దారితీస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు.

**వివాదం ఏమిటంటే..**

నాగర్‌కర్నూల్ నియోజవర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు తాడూర్ మండలం పొలుమూరు వద్ద ఇసుకను తీయడానికి అనుమతులున్నాయి. ప్రభుత్వం పొలుమూరు వద్ద దుందుభీ వాగులో రీచ్‌లను గుర్తించి అక్కడి నుంచి ఇసుకను తీయాలని ప్రొసీడింగ్‌లు ఇచ్చింది. మొదటిసారి 70 టిప్పర్లకు, రెండోసారి 62 టిప్పర్లకు అనుమతులిచ్చింది. ఎన్నికలు ముగియడంలో మూడోసారి 62 టిప్పర్లకు అనుమతులొచ్చాయి. ఈ క్రమంలో సదరు వ్యక్తులు పొలుమూరు నుంచి కాకుండా గుండూర్ సరిహద్దులో ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి గ్రామంలోనే డంపుగా పోశారు. అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా కల్వకుర్తితోపాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ తతంగమంతా నెలరోజులుగా కొనసాగుతున్నది.


రెండ్రోజుల కిందట గ్రామస్తులు అడ్డుకోవడంతో నిలిచిన టిప్పర్లు

### అనుమతుల ముసుగులో దందా..

60 నుంచి 70 టిప్పర్లకు అనుమతులు పొంది వందలాది టిప్పర్ల ఇసుకను తవ్వుతున్నారు. అదికూడా అనుమతిచ్చిన చోట కాకుండా మరోచోట. బాహాటంగా ఇసుక దందా సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. అధికార పార్టీకి చెందిన వారే ఇసుక మాఫియాను నడిపిస్తున్నారన్న వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇసుక లోడ్‌తో టిప్పర్లు హైదరాబాద్‌కు అధికారుల కంట్లో పడకుండా ఎలా వెళ్తున్నాయన్నదే పెద్ద ప్రశ్న. అంత పెద్ద వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా 40 నుంచి 50 టన్నుల ఇసుక లోడ్‌తో వెళ్తుంటే పోలీస్, రెవెన్యూ, మైన్స్ శాఖల అధికారులకు కనిపించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని కల్వకుర్తివాసులు చర్చించుకుంటున్నారు.